


# బూటు పాలీసు

బూౌట్ పాలీసని పిల్లప్పుడు ఇనింటి. అద్దమయిండ్లే ఇగ్గో అనంతపురం జాత్తి. తెల్సిపాయ.

గడియారం స్తంబం ఉండ్లా. ఆడ ఉణ్ణాది అసలు కథ. దానికి ముకాలు నాలుగైపాయ. రోడ్డులు జాత్తే మూడే తిమూతులా కట్ట.

ఆదినారాయుడు పొద్దు బొడవంగానే మునిసిపాలిటోల్ల సాపుల నీడల్ల కూసునుంటాడు. మాపిటేల గడియారం స్తంబం నీడను గొడుగు నీడ ఏసుకొని ఆడే పడింటాడు.


ఆదినారాయుడు అనాది నారాయనా, దరిద్దర నారాయనా అని పిలీ 'ఓవస్తి' అని పలుకుతుంటాడు.

ఆడన్నీ సెప్పుల సాపులేరే. సెప్పులు గుట్టి బతికేవోల్ల నోల్లుగొట్టీ, బాటాలు, కొరోనాలు సెప్పులు, బూటులు సెలాయిచ్చి అమ్ముతా ఉంటే తెలగోడొకడు నేనూ మొనగానినే, కానేమప్పా అని సెప్పులేపారం సేయబట్టె, అదారుపూలు మూడు కాయల అమ్మకాలుండె. అట్టా వచ్చి పడె అన్ని సాపులు. రంగురంగుల సోకులు, అద్దాలు, అద్దాల అలమరాలు, మెత్తటి కురిసీలు. కాలికింద నాపబండల మీంద పరుపులు, ఓయబ్బో దాం సొగుసే సొగుసు.

అగ్గో ఆడపడింటాడు మన ఆదినారాయుడ 'యామప్పా యట్టుండాది పని' అంటాని అడిగి నోనికి ' ఓ' అనే అంటాడు. బువ్వదిన్నా? అనింటే 'ఓ' అన్న మాటే మల్లా అనింటాడు. ఎప్పుడన్నా పిలీ 'ఓ' అనే అంటాడు. యావన్నా గాని అడిగి సుడీ 'ఓ' అంటానే ఉండేది. ఆదినారాయనికి పనయి పోయిండె. నానికేం, వాడో పెద్ద ఔదప్ప.

సెప్పుల రిపేరి ఆయప్పపని. పాలీసుకూడక జేసేదె! ఆదినారాయని ముందు పనిరాయి.

బూటు పాలీసు




కత్తి, సుత్తి, గూటం, ఆరె, తోలు, టైరు రబ్బరు, వారు, దారం, మైనం, నీళ్ళ డబ్బీలు, రంగు నీల్లు, నల్లంగా, ఎఱ్ఱంగా బ్రస్సులు, అన్నింటికంటే అతిముక్క్యం పాలీసు డబ్బీలు ఎఱ్ఱని, నల్లని వాటంగా అవురుసుకొని గూటమాకట్ల కూకునుండాడు.

కరెంటు స్తంబానికి నడుం మోటిచ్చి. సాపుముందుండే రయిలింగు నానుకొని, పుట్టుపాతు మింద చెయ్యి యోగదండం మింద పెట్టినా కట్టె పెట్టి, పద్ద మాసన వేసుకొని యోగీసురునికి పోటీగా ఉండాడు మన యీరో నారాయుడు.

కతా నాయకులనారు యట్టుండాడంటే, బీడీముట్టించిండె. కండ్లు మూసుకొనిండె. సొంపానం జేసే చతురువేది గా మారిపాయ. బీడి పొగసు మాయం జేశ. మంతరాల మర్రిపెట్టు కిందుండే ఆంపట్టు మాయల పకీరు మాదిరిగా బీడీ గొట్టం పుట్టిచ్చె పొగసు నోట్లోకి బారత దేస సోతంతరం పీలిసినట్లు బీలిసి సిద్ధిలాసంగ నవ్వుతాండె.

అప్పుడు జరిగింది అస్సలు కత. వాని పేరుకొండమీద రాముడు, దేవుడు కాడు. మనిసే అనసగుగ్గల్లు అమ్మతా ఉంటాడు. ఆడు ఆడ కూకున్నాడు. ఈడు ఈడ కూలబడె. ఈని పేరు తిరపతే. వానూరు తిరప్తిగాడు. అనంతపురంలనే!

డబ్బీ యెంతుంది? యేలంత! ఎన్నొత్తాయి అనసగుగ్గల్లు. పదో ఏమో! డబ్బీ యంత? పావ్లా!

రాయుడు తట్ట మింద ముసుగు దీశ. గుగ్గల్లు డబ్బిలోకి దోశ. తిరపతి సేయి బట్టె. గుగ్గల్లు రాయుడు పోశ. అయప్ప దీయ, ఏయ, ఈ యప్ప దినా మింగా సరిపాయ.

ఇంగ సాలనె.

సరె లెక్కదే అనే.

ఆయప్ప సేయిబట్టి, ఈయప్ప దుడ్డు దీయకపాయె.

రాయుడు ఐదు డబ్బీలనె. తిరపతి నాలుగనే. రూపాయి పావ్లా అనేరాయుడు. రూపాయే అనెని తిరపతి.

తిరపతి రూపాయ యిచ్చె,రాముడు పావ్లా దెమ్మనె.

లేదు పొమ్మనె, పోయేకి లేదనె. పెద్దరగడ, రచ్చ.

ఆసామి మెటికి దిగలా. ఈ సామి యెటికెక్కలా. పావ్లా తేల్లా.

రాయుడు పావ్లా యిచ్చికదలమనె. ఎవుడొత్తాడో జూత్తా రమ్మనమని తిరపతి యల్లబారె.

రాయుడు అంగీ బట్టి, తిరుపతి మూతి గ్గొట్టె. ఈడుదిట్టా, ఆడుగొట్టా, సరిపాయ.

ఆదినారాయుడు సన్నోడా? లే! కాకపాయ జూత్తా ఊరుకొన్నాడా? లే! ఊరుకోలా. లే! అనే, ఉండనే. ఆళ్ళుండిరి.

'తియ్ పావ్లాతియ్' అనే. ఇయ్ అనె. ఆడూ ఇనె.ఈడూ ఇనె. ఆడుతీయకా పాయ. ఈనికి ఈయకా పాయ.

ఆడు ఈన్నొదల్ల.ఈడు ఆన్నొదల్ల. ఇద్దరూ కరుసుకుండిరి.

'నేయం నువ్వే జెప్పప్ప నేంతింది 'నాలుగే' అనె తిరపతి

'దయివ సాచ్చికంగా జెపుతుండా నేనిచ్చింది ఐదు' అనె రాయుడు.

'మడయిదోగేడ బొయ్య'

'తినింటే యాడుంటది?'

'ఊరికే ఉండేకి ఆదినారాయనికేమన్నా పిచ్చా?' లేదు. ఆడేవన్నా అనాది మద్దేలయుడా? లేదు ఊరికే ఉండ్లా, మద్దెస్తం జేసేడు. దుప్పటి పంచాయితీ!

'పొన్లేప్పా! ఆయప్ప దిన్లేదనే. పాపవో, పున్నెవో పోనీ పావ్లా గందా!'

రాయుడు గయ్యిమన్నాడు. మండిపోయేడు. పాలీసన్నా- అన్నేయమన్నా! నీకేమన్నా. కడుపు నిండినోనివి. కొల్లకి చెపుతావు. ఇట్టజేత్తే ఎట్టాగన్నా. కడుపుబగ్గు మంటది.

ఆదినారాయుణుడు మల్లా యాఁవన్నా అంటే ఒట్టు. నోరు మూసె.

తిరపతిని అంగీ పట్టుకొని 'కక్కు నా పావ్లానాకు కక్కు'.

ఆడు లాగబట్టె, ఈడు గుంజబట్టి, అడటులాగె. ఈడిటుగుంజె. పెద్ద పీకులాట.

వానికీ, వీనికీ ఆల్లు ఈల్లు పోన్లేప్ప అనీ, ఇయ్యాప్ప అనీ సెప్పిరి. ఈళ్ళినక పోయిరి. రాయుడూ ఇన్లే. తిరపతీ ఇన్లే. పంచాయతీ తేలకపాయే.

ఆనా కొడుకూ ఇనకపాయ, ఈ నా కొడుకు ఇనకపాయ, యా నాకొడుక్కుజెపుదు? అంటా గొణిగి, ఆదినారాయుడు ఎద్దు తోలునే పులి తోలు జేసుకొని సిమ్మాసన వేసుకొని మారాజాకట్లదిక్కులు జూత్తన్నాడు.

అప్పుడొచ్చె అయ్యపసామి బత్తుడు. రాంగానే 'ఆదెన్నా' అనే. 'యావన్నా' అనే నారాయుడు

'మాలేసుకో మనింటే ఇనవేం'. అనే. 'నాకేడసావి' అనే. అంటే ఇన్లా. ఆడడగతానే ఉండె. ఈడు 'నావల్లగాదు సావీ' అంటానే ఉండె. సివరికి ఇసుక్కొని 'నువ్ బోసావీ' అనంటండగా అయ్యప్పబత్తుడు యల్లబారె.

'కాల్లకిసెప్పుల్లేవుగానీ, మల్లా మెల్లోమాల' అంటా ఆదినారాయుడు సీదరిచ్చుకొనే.

అయ్యప్పసావి బత్తుడటుబోంగా ఇటు ఉరుతూ ఎల్లుకొచ్చె ఆకలిమీదున్న ఆవు. గడ్డి దొరక్క గొల్లమీంద అంటిచ్చిన పోట్టరులు తినేకి ప్రాక్టీసు సేశ. మంచి తరిబీదు పొందె. గొప్ప అనుభవం సంపాదిచ్చ.

అది ఆవుగందా, ఎద్దాకట్ట ఉండే యీరోల పోట్టరుంటే దానికి మా యిట్టం.

యంటి రామారావు పోట్టరు కనబడితే సాలు, కరాబిరా గుంజి, కసాబిసా నమిలి, కడుపు నిండా తిని, గడియారం స్తంభం నీడలో నిద్దరబోయి లేసి నెమరేత్తది.

ఆయ్యప్ప పోట్టరులు మునుపు సినీమాలవి. ఇప్పుడు రాజకీయాలవి కొల్లగా దొరుకుతా

ఉండె.మేతకేం కొదవలేకపాయె.

ఆరోజుది వచ్చి ఆదినారాయుని పనిరాయి కాడున్న తోలు మూచ్చూచి మూత్తోకెలుకుతా ఉండింది.

'అది నీ తోలేనే కామదేనువా! నాతొలెందుకుదీత్తా తల్లీ' 'పో అమ్మా పో' అంటే అదెంత మంచి ఆవొసుడీ తలూపుకొంటా పోబట్టే.

'పొద్దున్నే యాందప్పా మీరచ్చపొండటు' అంటే ఇన్లా. ఆడీయడు. ఈడొదలడు. అల్లిద్దరూ తన పనికష్టం.వదలమంటే వానికి కోపం. ఇమ్మంటే వీనికి కోపం. ఇద్దరి గొడవ తన పనికి చేటు.

కరవమంటే కప్పకి సావు. వదలమంటే పాముకు ఆకలి. ఏందబ్బా పీడ.

ఈల్లరచ్చవల్ల వీనికాడికి ఎవల్లూ రాటం లేదు. పనిసెప్పటం లేదు. సేయించుకోవటం లేదు.

పాండి సావీ అంటే ఎదల్లూ ఇనటం లేదు. ఇసుగు బుట్టే.

గోనె పట్టా కింద ఉన్న పొవ్లా తీసి, 'రాయుడుఇట్టారా' అనె ఆయప్పరాంగా పావ్లా ఇచ్చి పొండప్పా 'అనే'. రాయుడు తిరుపతి అంగీ వోదిలె. పావ్లా తట్ట అంచున బెట్టలా.

'అన్నా ఎందుకన్నా నీ పావ్లా నాకొద్దు.'

'పోన్లే తీసుకో'మని నారాయుడు ఇసుక్కొనే. రాయుడు పావ్లా తీసుకొనే. తిరుపతి పత్తాలేడు. యటుబొయెనో యట్టాబోయెనో రాయుడు ఎంటబడె. ఎతకబట్టే.

అప్పుడొచ్చె సుందరాంగుడు సూటర్మీద బయ్యీమంటా.

సుందరాంగుడు సూటరాపె. ఆదినారాయుడు అట్టా గదిలి, ఇట్టా కూకుండె.

సుందరాంగుని పేరు ఓబిలేసు, తెల్లపేంటు తెల్లఅంగీ. మరక లేదు. మచ్చలేదు. గంజిపెట్టె. బట్టలు ఓబిలేసు మాదిరిగా నీలుగు తా నిక్కబొడుసుకొని ఉండయ్.

'రాంగానే పాలిష్ అనె. ఆదినారాయుడుతే' అని ఆయప్ప ఇచ్చె ఈ యప్ప దీసుకొనె. చెప్పులేం పాతగా కాలా. కొత్తగానే ఉండాయి. పాలీసేం పనిలేదు. సొగ్గాడు పోలీసు సేయమంటే తన సొమ్మేం పోదు గందా, సేత్తే సరిపాయే.

బ్రస్సు తుడిసె. సెప్పులు కిందికి మిందకే తిప్పె. దుమ్ము దులిపె.

'యాడగొన్నాసావీ'

'ఈడే'

'యెంతసావి'

'మున్నూరు'

'యెందుకుసావీ'

'యేందెందుకు? అగ్గవా'

'యెర్రగ్గవ సాల్లెసావీనూరియ్'

'దీనబ్బాకట్టా జతగుట్టిస్తా ఎన్ని జతలు గావల్ల.?'

'ఇయ్యి సాపులో గొన్నా'

'ఇట్టే జేసిత్తా సావీ'

'ఈటికి ఆటికి సాటా పోటా'

'అన్నీ సెప్పులే సావీ'

'అందరూ మనుషులే సామీ అన్నట్లుగానే ఉంది. సాల్లే కానీ పాలీష్‌కాని బేగి నే పోవల్ల.'

ఆదినారాయణుడు గొణుగుతా ఉండె. మట్టితుడిశ. రంగునీళ్ళద్ది. పాలీష్‌రాయబట్టే.

'యాంజెత్తా సోవి'

'ఉజ్జోగం'

'యావుజ్జోగం'

'అయ్యోరు'

'యావూళ్ళో'

'యీ వూళ్ళోనే'

'ఈడంటే'

'పాట్ట శ్రీరాముల్లో'

'సంబళం యెంతసావీ?'

'నీకెందుకప్పా నీ పని నువ్‌జూసుకో'

'యాంలేదు సావీ సెప్పులజత మున్నూరు పెట్టి కొనింటేను అడిగా.కోపమేలసావీ'

ఓబిలేసులకలా. పలకలా. ఉరుముల్లేని వానొచ్చినట్టు రాయుడొచ్చీ రాంగానే ఆదినారాయుడడిగే ఇచ్చెనా?'

'యాడిచ్చె ఇయ్‌లె, దొంగముండాకొడుకు. అంగీబడితి. మూతికిడిసి కొట్టే. నేనూ గొడితి.మూతి బగిలె. పన్నూడె, నెత్తురోడె.

'ఆడూ రకుండెనా?'

'యాలుంటాడు పై బగల గొట్లా?'

'కొట్టేడా?'

'కొట్టేడా! సావగొడితేను ఇట్టా సూడుయెట్లా గొట్టేడో మొరటు ముండాకొడుకు.'

ఈపి సూపిచ్చె. తాటలేసుండె.

'పాన్లే రాయుడు సోమ్మూబాయే శనీ బట్టె.

'అంతేనన్నా'

ఆదినారాయుడు మాట్లాడతా, మాట్లాడతా పాలీసు చేశ. పేలికదీశ. సోకు చేశ. సెప్పులు మెరవబట్టె.

'బాగుండాయా సావీ?'

'బాగులేకేనుప్పా బాగుండాయి మెరుత్తా ఉండాయి.'

'అద్దాలకట్లా లెవ్వాసావీ?'

'లేకేమప్పా'

'మొగం సూసుకోవచ్చు సావీ'

'నిజమేలేప్పా!'

ఓబిలేసు పరుసులాగె.ఐదురూపాయలకాగితం పెళపెళలాడతా ఉంది, ఆయప్ప పేంటున్నట్టుంది. నారాయుని ముఖం మిందికిసిరె. అట్టా ఇసిరిందాన్ని, ఆడు ఇట్టాబట్టె. పట్టగానే గోనే పట్టా కింద పెట్టె, పెట్టి దుడ్డు రొండు రూపాయల బిల్ల దగదగా మెరిసేది తీసి 'ఇగ్గో సావీ' అనే.

ఓబిలేసినకపాయె. సూటర్ టురుబురులాడిచ్చ.

'సావీ' అనె నారాయుడు.

'ఏవీ' అనె ఓబిలేసు

'లెక్కసావీ!' అంటే 'ఇస్తిగదప్పా' అనె

'నేని నీకి ఇస్తా ఉండా సావీ'

'నీకిస్తి నాకేలనప్ప అయ్యి నీకు నీకే

'నీ దుడ్డు నాకేలనప్ప తీస్కో సావీ తీస్కో'

'నాకిస్తి, నీకునీకే. పిల్లలోనివి. పిల్లోల్లకేమన్నా కొండ పోప్పా!'

'నాదుడ్డు బెట్టి నేని కొనుక్కుపోతే పోతా, లేకపోతే లేదు. నీకేలా సావీ నీ దుడ్డు నువ్ దీసుకుపో'

'పిల్లలకేమన్నా కొండబోప్పా'
'నీ దుడ్డు నాకేల నప్పా'
'నేన్నికిస్తి, అది నీదే!'
'నాదికాదు, నీ దుడ్డు నీదే!'
'నువ్ పాలీసు జేసిందాకిచ్చా'
'పాలీసుకు మూడే అయిదుగాదు'
'నేను నీకు ఊరికినే ఇచ్చా'
'ఊరికే దీసుకోను సావీ'
'కష్టపడ్డందుకే ఇచ్చా'
'అందుకు మూడు సాల్ సావి.'
'దయగా ఇచ్చేనే అనుకో'
'ఎవుల్లదయా నాకొద్దుసావి'
'ధర్మం చేసేననుకో'
'బిచ్చదాన్ని కాదుసావీ'
'పాలిష్‌కే ఇచ్చాననుకో'
'మూడుపాలు సావీ అంతేనారేటు'
'నారేటు ఐదు, నేనేడ పాలిష్ చేయించుకొన్న ఇదే ఇస్తా.'
'నేను మూడు తీసుకొంటా సామీ'
'నేను ఐదు ఇస్తానప్పా.'
'నువ్వు యాడన్నా ఇచ్చుకోపోండి నాకాడొద్దు.'
'నువ్ యాడన్నా మూడు దీసుకో నాకాడ అయిదు తప్పదు.'
'ఓబిలేసు స్కూటర్ ఆపి దగ్గరగా వొచ్చి, మందలించినట్టుగా అనినాడు.'
'లెక్క నీకెక్కువాయనా'
యాంసావి నీకెక్కువాయనా?'
'నాకిచ్చేకుంది!'
'నాకు తీసుకొనేకి లేదు.'
'యాం లెక్కసేదా'
'పరుల సొమ్ము పాము సావీ'

'ఆలెక్క నీదప్పా'

'దాన్ని నేనుసంపాదించలేదు గదప్పా'

'సుడీ నువ్ బీదోనివి. రొండు రూపాయలు నాక్కట్టంగాదు. ఉంచుకో.'

'సుడీ, నువ్ ఉజ్జోగిని. అది నీ నోటకాడికూడు. పుట్టినోల్లు. ఆల్లమ్మ బతకాల్నావద్దా? అయ్యోరికి జీతవే గానీ, నాతం పయసేం రాదు గందా? నాకంటావా ఇయ్యాలొత్తది. రేపు పోతది. రెక్కల కట్టం. బయింలేదు. లెక్క కావల్లా? కట్టపడు. కాసులుగలగల రాసులే! లెక్క వద్దా? ముద్దు దిను. గొంగిలెయ్. సారగం కాల్లకాడ కాపలా. ఇంటివా సావీ నాసొమ్ముపైసా పోరాడు. పరుల సొమ్ము ఎర్రఏగాని రారాదు. ఇది నీది. నాకొద్దు.'

'అందికే నప్పా నీయతలు నానాటికీ నీయతలే.యానాటికీ నూడు యనట్టోకి నూకలెతుక్కోటమే. మంచి గుడ్డల్లే, కొట్టంలే, గంజిలే, ముద్ద అసలే లేద. రోసమా ఓయబ్బో మీసాల కంటే పొడుగు. ఉన్నీయప్ప లెక్క.

'నాకొద్దంటే ఇనవేం సావి'

'పై అంగీ లేకపాయె. తినేకి లేదు. ఉండేకి లేదు. ఎవల్లూ జాలి చూపెట్టరాదు. దయతలవ రాదు. ధర్మం సేయరాదు. జీవితం గొంగిలి. ఏడేత్తే ఆడే పడుంట. ఇదేవన్నా బాగుందా! ఇత్తే వద్దనటం నువ్ పిల్లోనివా! పిచ్చోనివా?'

'యాం సావీ నేనూ నిన్నదే మాటంటే ఏంజెపుతా సావి సెప్పు. నువ్ పిల్లోనివా పిచ్చోనివా లెక్క పారేసుకుంటే బతుకుతావా? బట్టకడతావా? బాగుపడతావా? యాంది సావి యెర్రోనాకట్టీ తీసుకొని యెల్లుసావి' యాపప్పా సెప్పేది నీకే.

'పేదోనివని ఇస్తండా'

'ఇట్టా ఇచ్చిపేదోడయ్యేవోళ్ళు అంటే సావి.' నాకు తెగని మంట.

'రొండు రూపాయలతో నేను పేదోన్ని కాను.

'దీనితో నేనున్నోన్నికాను.'

'ఇట్టా రొండూ రొండూ పోగుచేసుకొంటేనే కలసొచ్చేది.'

'ఇట్టారెండూ రెండూ, పోగొట్టుకొంటేనే శనిబట్టేది.'

'ఇంత మాత్తరాన నా కొంపేం మునిగిపోదు.'

'దీనితో నా కొట్టమేమీ మేడామిద్దే కాదు.'

ఓబిలేసు దగ్గరగా వచ్చినాడు 'నీకేం తెలివిలేదా.'

ఆదినారాయణుడు పైకి లేచి నిటారుగా పసికట్టే ఆకట్ట నిలబడిపోయినాడు.

'నీకేం మది లేదా?'

'నీకింత ఆం పనికి రాదు.'

'నీకేం ఇంత పొగరుండొచ్చా?'

'మాట మరేదగా రానీ'

'నోరు ముయ్యి, ఒక్క మాట, మరి ఒక్క మాట అంటే విని ఊరుకోనేకి సేతులుకి గాజుల్లేవు. తీసుకో!'

'తీసుకోకపోతే యేంజేత్తా.?'

'ఇసిరి అవతల పారేత్తా.'

'ఇంత పొగురుండే నాకొడుకు కాడ పాలీసు సేయిచ్చు కోటం నాదేబుద్ది తక్కువ.'

'ఇంత లెక్క తిమ్మిరెక్కిన తిక్కనా కొండెగానికి పాలీసు చేసెయ్యటం నాదే తప్పు!'

'కొండెగాడంటా వేమిరా!'

'కొడుకంటే ఊరుకొంటావనుకొంటున్నవా? మాట పడే మనిసులుగాదు మేం.'

'నాలుగుదంతే ఏం జెత్తా.?'

'తన్నిఅడుగు అటెయ్యిసూద్దువుతడాకా. ఊపిరాడితే ఒట్టు!'

'ఇద్దరూ కలబడేట్లు కనపడితే, రాయుడు అడ్డంబోయ. ఇడిపిచ్చబట్టే. వానికీ కోపమే. వీనికీ కోపమే. మండి పడతా ఉండారు.

లెక్క ఈలేదని, ఇమ్మని తన్నుకోవటం మామూలే! కానీ, ఇత్తానంటే వొద్దంటే వొద్దని తన్నుకోబోవటం రివాజు గాదు. ఈళ్ళిద్దరూ ఏం జాతో ఇసిత్రంగా కనపడతా ఉండారు.

ఇద్దరు తగ్గి తీసుకోసావీ అంటేవద్దప్పా అనుకొంటూ ఉండారు.

ఆయప్ప వొద్దంటానే ఉండాడు. ఈయప్ప తీసుకోమంటావే ఉండాడు. అటొద్దు, ఇటు తీసుకోల, మద్దెన రొండు రూపాయల బిల్ల సూరీడు సాచ్చికంగా మెరవబట్టె.

నారాయుడియ్యబాయ. ఓబిలేసు చేత బట్టకపాయ. అది అటు కదిలె. ఇటు కదిలె. ఎగిరిపడె.పడడం పడడం అనపగుగ్గులల్లో పడె. పడికదలబట్టె. మెరిసిపోబట్టే.

బిల్లను రాయుడు చూసె. గుగ్గుల్లు చూశ. నారాయుడు బిల్లసూసె. ఓబిలేసు ముకం సూశ. ఓబిలేసు బిల్లనూ రాయున్ని నారాయున్ని చూశ. నగె.

ఓబిలేసూ వొంగలేదు. నారాయుడూ వొంగలేదు. బిల్లతీయలేదు. రాయుడు బిల్లతీసి వానికి గానీ, వీనికి గాని ఇయ్యలేదు.

ఇద్దరూ తీసుకోనుంటే తీసుకోమనిరి. తీసుకోలేదు. మారాజులు వంగితీసుకొనటమా ? తీసుకోలేదు.

ఇద్దరూ ఒకనినొకడు పిచ్చోడె అనుకొనినారు.

నీ బతుకింతే, మీ బతుకులింతే, మీరు బాగుపడరు. పైకిరారు అని తిట్టుకోసాగినారు

ఓబిలేసు ఏడిసినట్లు నగె. నగి పరుసుదీశ. దీసి రొండు రూపాయల కాగితంపైకి పీకె పెళమంటా ఉంది. కొత్తది బేంకునోటు. జీవం వచ్చినట్లుంది. తీసుకోమనె.

నారాయుణుకి జొర మొచ్చినట్టాయ. తల బరుక్కొనే. జుట్టు పీక్కొని పిచ్చోనాకట్టా జూశీ. 'నీగ్గాని పిచ్చనా, తిక్కనా, మదవా రోగమా' అని యెర్రోడు అడిగినట్టు అడిగినాడు.

'నీకి రొండు ఇచ్చేది ఇచ్చేదే! అంత దాంకా తిక్కే' అని ఒప్పుకొనే ఓబిలేసు.

నారాయుడు వోడిపోయినాడు. అలిసిపోయినాడు. మూలిగివాడు. సణిగినాడు. గొణినాడు. 'తే' అనే తీసుకొనే గొనె పట్టాకింద కప్పెట్టి కప్పెట్టీ 'సావీ' అనె.

ఓబిలేసు నగతా ఉండే. 'ఏమీ' అనే. బలే కుసికుసిగా ఉండె.

నారాయుడు అట్టాజూత్తానే ఇట్టా అడిగె. 'యాలసావి నాకు రెండిచ్చిందాంకే నీకూపిరాడలేదు.'

'పాపం మనోడు, పేదోడని, యాలతప్పా'

'సావీ నేనుఅనుకొనే ఉండాసావి ఈయప్ప మనోని అకట్టఉండాడు అని.'

'మడింకేం మనోన్నే నప్పా'

'అట్టా జెప్పు సావీ నాకిప్పడంతా తెల్లారినట్టు తెలిసిపోతా ఉండినాది సావీ'

'యాం దెలిసిపోయినా దప్పానీకి'

'ఈడు నిజంగా మనోడే. ఇంకొకడయితే ఇట్టా చేయడు. లెక్క ఇట్ట పొగొట్టుకొనే వాడంటే ఈడు మనోడే! ఈడు ఇట్టా ఇచ్చి ఇచ్చి పొగొట్టుకొని, పేదోడయి ఏడుత్తాడు. ఈడింతే. ఈడుబాగుపడడు. ఈన్ని ఎవుడూ బాగు చేయలేడు. అది సావి. అది గది తెలిసింది.'

'నిన్ను నేను యావందాననుకొంటా ఉండానో అచ్చంగా అదే నువ్వు అనుకొంటా ఉండావు. నువ్వు బాగుపడితే, నా కానందమప్పా! నేను చెప్పులు గుట్టే వోనికి బుట్టా! నీకొడుకులు ఉజ్జోగులు కావల్ల ! సంపాయించు. సది విచ్చు.'

'సర్లేలే సావి నీ పిల్లల్ని సెప్పులు కుట్టేవోళ్ళని సెయ్యొద్దుసామి ఇట్ట లెక్క తగలేసి. సంపాయించి నిలవుంచు సదివించు.'

'నువ్వు నన్ను రొండురూపాయల పేదవాన్ని చేసేవు.'

'నేనా సావీ'

'ఔ'

'యాల!'

'ఆ రొండు తీసుకొని ఉండింటే మల్లా రొండు ఇచ్చి ఉండేవోన్ని కాదు గందా! అట్టా రొండు రూపాయల పేదవోన్ని అయ్యే వోన్నికాదు గందా! నా పేదరికానికి నువ్వే కారణం.'

'నారాయుడి తలకాయలో పురుగులు పుట్టినాయా అన్నట్టుగా ఉండినాడు.

'ఆ రొండూ తీసుకోరాదా వద్దంటినా'

ఓబిలేసు తీరికగా చెప్పినాడు. కింద బడ్డ రొండా! మరొకడి తట్టలో పడ్డరొండా. నేనా? నేనా తీసుకోటం? నాదే జాతి మారాజులం. ఇయ్యటమే కానీ, తీసుకోటం మాయింటా వంటా ఉంటుందా?

నువ్వెందుకు ఆ రొండు కూడక తీసుకోలేదని అడిగినట్లయి నారాయుడూ 'నేనూ అంతేకందా! నేనేం తక్కువతిన్నానా? నీకంటే రొండాకులు ఎక్కువే!'

వాల్లు ఇద్దరూ ఆ రొండు రూపాయల బిల్ల తీసుకొనేటట్టు లేరని రాయునికి తెలిసి పోయినాది.

వీల్లు పేదలవకుండా ఉండలేరు. నిద్రపోలేరు. వీల్ల బతుకింతే! అనుకొన్న రాయుడు 'నారాయుడన్నా' అనివాడు 'యామప్పా!' అనంటే 'ఎల్లొత్తానన్నా?' అని. అనెనా ఇంగ ఆగితే ఒట్టు. తట్టెత్తె. తలకెత్తి. ఉరకబట్టే. తిరిగిసూత్తె నీయడం కాలి సెప్పుతో ఎవున్నన్నా గొట్టు. నీయిష్టం.

రాయున్ని ఎవల్లూ పేదోన్ని సేయలేరు.

గడియారం స్తంభం ముకాలు నాలుగు. రోడ్లులు మూడు. ఈళ్ళిద్దరు. రెండు రూపాయల బిళ్ళ ఒకటి. దాని సుట్టూ తిరిగే సూరీడు మల్లీ పుడతాడని కుంకుతా ఉండాడు.

★